క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శ్రీవారికి పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ దాసన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ శాఖ ఏఈగా సురేష్

నకరికల్లు: మండల విద్యుత్‌శాఖ ఏఈగా సురేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న రూఫస్ డానియేల్ బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో మార్కాపురం నుంచి వచ్చిన సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాల్సి అవసరం ఉంటుందన్నారు. సకాలంలో మరమ్మతులపై స్పందించి రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉంటానన్నారు.

నేడు వైద్య శిబిరం

క్రోసూరు: సత్తెనపల్లి శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో ఆదివారం ఏవిఏస్ హాస్పిటల్ హైదరాబాద్ వారిచే రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వెరికోస్‌వెయిన్స్‌వ్యాధి నివారణకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ సభ్యులు కట్టమూరి అప్పారావు శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం జరుగుతుందని, బీమా, రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కలదని, ప్రైవేటు బీమాలు స్వీకరించబడతాయని వివరించారు. కావున సంబంధిత వ్యాధిగల రోగులు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. వివరాలకు : 9989527715, 040- 22227799కు ఫోన్ చేయవచ్చునన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం నిల్వ కేసులో నిందితుల్ని అరెస్టు చేసి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు శ్రీనివాసనగర్‌లో దాడులు నిర్వహించి, అక్రమంగా తెలంగాణ మద్యం కలిగి ఉన్న వెంకటేష్, కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటర్ల నమోదుకు ఇంటింటా సర్వే చేయాలి

ఆర్డీఓ రాజకుమారి

రాజుపాలెం: ఓటరు నమోదు కోసం గ్రామంలో ఇంటింటికి సర్వే చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ బి.ఎల్ఎస్ రాజకుమారి తెలిపారు. మండలంలోని కోటనెమలిపురి, కొండమోడు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆర్డీఓ శనివారం పరిశీలించారు. సర్వేబృందం వెంట ఆర్డీఓ వెళ్లి ఇంటింటా సర్వే చేశారు. గ్రామస్తులను సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకుల ఓటును తప్పనిసరిగా చేర్చాలని బీఎల్వోలకు సూచించారు. ప్రతీ ఓటరుకు డోర్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. చనిపోయిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. గ్రామం విడిచి వెళ్లిన వారిని గుర్తించి గ్రామంలో విచారించిన తరువాతనే ఓటును తొలగించాలని చెప్పారు. గ్రామ వలంటీర్లను సర్వే బృందం వెంట ఉంచుకోవద్దని, వారి ప్రమేయం లేకుండా చూడాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దారు నళిని, పిఎస్ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటనారాయణ, బీఎల్వోలు దుర్గాప్రసాద్, కనకదుర్గ ఉన్నారు.



ఇంటింటి సర్వే పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ నగేష్

సర్వే తప్పులతడకలు లేకుండా చేపట్టాలి

నకరికల్లు: ఇంటింటి సర్వేను తప్పుల తడకలు లేకుండా సమర్ధవంతంగా చేపట్టాలని ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి సూచించారు. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లో ఎస్ఎస్ఆర్ 2024 ఇంటింటి సర్వేను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా చేర్చుకునే ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లు, మార్పులు, చేర్పులకు సంబంధించి బీఎస్ఓలు సర్వే నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. మృతిచెందిన ఓటరు వివరాలు, పర్మినెంటు షిఫ్టులకు సంబంధించిన వివరాలు పొందుపరిచేందుకు ఫారం-7 వినియోగించాలన్నారు. నివేదికలను తప్పుల తడకలు లేకుండా కార్యాలయానికి పంపాలన్నారు. 10 కన్నా ఎక్కువ ఓటర్లు నమోదైన ఇంటినంబర్‌ను ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్సుతోనే అభివృద్ధి సాధ్యం

అమరావతి: శాస్త్ర సాంకేతిక పరి/జ్ఞానమే మానవాళి మనుగడకు, అభివృద్ధికి మూలమని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన శ్రీ సరస్వతి విద్యాపీఠం వారు నిర్వహించే గణిత విజ్ఞానం మేళా సంస్కృతి మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి స్థానిక సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి మాతాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ఆదికాలం నుంచి నేటి వరకు ప్రపంచం అన్నిరంగాల్లో ముందడుగు వేసిందంటే దానికి కారణం శాస్త్ర సాంకేతిక పరి/జ్ఞానమే అని అన్నారు. ఎందరో గొప్ప శాస్త్ర వేత్తలు తమ మేధస్సును ఉపయోగించి సైన్సులో ఎన్నో కొత్త కొత్త విషయాలను ఆవిష్కరించారని వారందరిని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సైన్సుపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ గణిత విజ్ఞానం మేళాకు విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు, నెల్లూరు జిల్లాల సరస్వతి విద్యాలయాల నుంచి హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, యాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, కోలా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరరావు, పశ్రీను, మరియు స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరరావు

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: రైతులు తప్పనిసరిగా సాగు పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. అన్ని గ్రామాల్లోను ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబందించిన సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు ప్రభుత్వం అందించే బీమా సాయం అందుతుందన్నారు. కౌలు సాగు చేసే రైతులు కార్డు ఉంటే ఈ-క్రాప్ నమోదు చేసుకోవచ్చన్నారు. పంట నమోదు చేయించుకున్న వారు ఏ పంట అయితే నమోదు చేసుకున్నారో వారికి సున్న వడ్డీ రాయితీ లభిస్తోందని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర లభించినప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఉండాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ పావని, సిబ్బంది పాల్గొన్నారు.



ముప్పాళ్ళలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అరుణ

విద్యార్థి దశలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కాకతీయ కల్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు కళాశాల ప్రిన్సిపల్ కావూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తే సాధించలేనిది ఏమి ఉండదన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కృష్ణవేణి విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టే విధంగా విద్యార్థులు కష్టపడి చదివి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. మాచర్ల కృష్ణవేణి జూనియర్, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ యనమదల వెంకట్రామయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చెప్పినవి పాటిస్తూ సమాజం గురించి అవగాహనతో కష్టపడి చదువును కొనసాగిస్తే తప్పకుండా ఉన్నత స్థితికి చేరుకుంటా రన్నారు. కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థు లందరూ పోటీతత్వంతో విద్యనభ్యశిస్తే చదువులో సాధించలేనిది ఏమి ఉండదన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు దగ్గుపాటి శివ బ్రహ్మారెడ్డి, ఎం సుబ్బరాజు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసరావుపేట బ్రాంచి వారు ది.18-07-2023న గార్లపాటి అంజయ్య గారి భార్య విమలాదేవి గారి ప్రకటనలో గ్రామకంఠం డి.నెం.794గా చదువుకోగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వలైను, రవీంద్రనగర్, గుంటూరు
సెల్ నెం: 9030595227, 9848052914

బ్యాంకు ఖాతాదారులకు న్యాయం చేయాలి

సీపీఎం పల్నాడు జిల్లా సభ్యుడు రవిబాబు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో గల దొడ్లేరు చైతన్య గోదావరి బ్యాంకులో జరిగిన తనఖా బంగారం వస్తువుల గోల్ మాల్ పై సమగ్ర విచారణ జరిపి ఖాతాదారులకు న్యాయం చేయాలని సీపీఎం శనివారం డిమాండ్ చేసింది. ఈమేరకు దొడ్లేరు బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం పల్నాడు జిల్లా వర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బ్యాంకులో తనిఖీకి వచ్చిన అధికారులతో ఈ విషయమై చర్చించినట్లు చెప్పారు. బ్యాంకులో బంగారం అప్రైజర్‌గా పనిచేసిన నాగార్జున పథకం ప్రకారం ప్రతి గ్రామానికి కొంత మంది బినామీలను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా లావాదేవీలు నడిచేటట్లుగా ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు తెలిజేశారన్నారు. అదేవిధంగా తాకట్టు పెట్టుకున్న ఖాతాదారులు రెన్యువల్ చేసుకున్న సమయంలో అసలు రశీదులు ఇవ్వడం జరగలేదని, ఇచ్చినా ఆభరణాల వివరాలు రాయకుండా ఇచ్చినట్లు గుర్తించడం జరిగినట్లు చెప్పారని తెలిపారు. బ్యాంకు మేనేజరు, కిందస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్రైజర్ నాగార్జున బంగారం వస్తువుల్లో అవకతవకలకు పాల్పడి తన బినామీల పేర్లతో బ్యాంకులోనే తనఖా పెట్టినట్లు అధికారులు చెప్పినట్లు తెలిపారు. ఖాతాదారులు తమ బంగారం వస్తువులు ఉన్నాయా లేవా తెలుసుకునేందుకు వచ్చే నెల 3 వ తేదీ వరకు తనిఖీ అధికారులు స్లిప్పులు ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి వరకు ఖాతాదారులు తమ వస్తువులు ఏమయ్యాయో నని తీవ్ర మానసిక ఆందోళన చెందే పరిస్థితి నెలకొందని అన్నారు. కావున బ్యాంకు తనిఖీ అధికారులు ఖాతాదారులతో సమావేశం నిర్వహించి వారికి పూర్తి భరోసా కల్పించాలన్నారు. ప్రతి ఖాతాదారుడికి ఒక గ్రాము బంగారం కూడా నష్టం జరగకుండా బ్యాంకు అధికారులు పూర్తి భరోసా కలిప్సస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి తిమ్మిసెట్టి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి బ్లడ్ గ్రూపుల పరీక్షలు

మాచర్ల: త్వరలో జరిగే స్వాతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత బ్లడ్ గ్రూపులు నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ ఈవి రమణబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద సేవలు మరువలేనివన్నారు. 150 మందికి ఉచిత బ్లడ్ గ్రూపుల గురించి సమాచారం తెలిపారు. రాబోయే రోజుల్లో యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. రామకృష్ణ సేవా సమితి సెక్రెటరీ పోలిశెట్టి పుల్లారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పవరపు గాంధీ, షేక్ లాలు సాహెబ్, ముత్యాల పాపిరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు, బొగ్గవరపు సత్యనారాయణ, మణి ల్యాబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.